కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో.. రూపాయల్లో..) టమాటా.11, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 40 బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 37, పచ్చకాకర 38, పందిరి బీర 38, క్యాబేజీ 9, క్యారెట్ 15, దొండ 35, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 50, గోకరకాయ 40, కీర 15, దోసకాయ 20, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 25, చామగడ్డ 45, మొరంగడ్డ 28, కందగడ్డ 60, సొరకాయ 9, పొట్లకాయ 20, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

అర్హులకు పథకాలు అందేలా చూడాలి



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను కలిసిన సేవాదళ్ నాయకులు

అడ్డగుట్ట: అర్హులైన నిరుపేదలకు రాజీవ్ యువ వికాసం పథకం అందే విధంగా చూడాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎస్. ప్రీతమ్‌ను అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షురాలు డి.రామలీల మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అర్హులకు అందజేయాలని విన్నవించారు.

ఎన్నికల ప్రక్రియలో ఏఐను అనుసరించాలి

సనత్‌నగర్: ఖచ్చితత్వంతో కూడిన ఓటరు జాబితా రూపొందించడంలో కృత్రిమ మేధ (ఏఐ) ఎంతగానో ఉపకరిస్తుందని, ఎన్నికల సంఘం దీనిపై దృష్టిసారించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సనత్‌నగర్ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి సమ్మయ్యను కలిసి ఏఐ ఉపయోగం గురించి వివరించారు. భారత దేశం సాంకేతికపరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఎన్నికల ఓటరు జాబితా నిర్వహణలోనూ ఏఐను అనుసరించడం అత్యవసరంగా ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల్లో పారదర్శకత, న్యాయబద్ధతను ఏఐ పెంచగలదన్నారు. పలుచోట్ల రిజిస్టర్ అయిన ఓటర్లను గానీ, డూప్లికేట్ ఓట్లను ఏఐ గుర్తించి వాటిని ఫ్లాగ్ చేయగలదన్నారు.

ఆస్పత్రి సిబ్బందిపై దురుసు ప్రవర్తన

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ న్యూబోయిగూడలో ప్రభుత్వ పశువైద్యాసుపత్రి సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆసుపత్రి వైద్యాధికారి ప్రొఫెసర్ అయోధ్య గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 18న బబ్లూ అనే యువకుడు తన పెంపుడు కుక్కను తీసుకొని చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారు. అయితే అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ గార్డులతో వాగ్వివాదానికి దిగి గందరగోళం సృష్టించాడు. సెక్యూరిటీతో పాటు డాక్టర్ల పట్ల దురుసుగా ప్రవర్తించి నానా హంగామా చేశారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ రాజు చెప్పారు.

వ్యక్తి అదృశ్యం



రమేష్

అడ్డగుట్ట: పనికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శంకర్ నాయక్ తెలిపినమేరకు.. అడ్డగుట్టలోని వడ్డెరబస్తీకి చెందిన రమేష్(25) ర్యాపిడో బైక్ రైడర్‌గా పని చేస్తున్నాడు. రోజూ మాదిరిగానే ఈ నెల 19న సాయంత్రం 4 గంటల సమయంలో పనికి వెళ్లిన రమేష్ రాత్రైనా ఇంటికి రాలేదు. దీంతో అతని భార్య ఫోన్ చేయగా ఫోన్ స్విచ్చాఫ్ రావడంతో తెలిసిన వారిని వాకబు చేసింది. ఫలితం లేకపోవడంతో గురువారం సాయంత్రం తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఆన్‌లైన్ గేమింగ్ ముఠా అరెస్ట్

వెంగళరావునగర్: ఆన్‌లైన్‌లో గేమింగ్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ముఠాను మధురానగర్ పోలీసుల సహకారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. మధురానగర్ ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం... ఎల్లారెడ్డిగూడలో కొంతకాలంగా చట్టవిరుద్ధంగా కొందరు ఆన్‌లైన్ గేమ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఎల్లారెడ్డిగూడలోని శ్రీదివ్య ఎన్‌క్లేవ్‌లో ఈ ముఠా ఉన్నట్టుగా గుర్తించారు. శుక్రవారం పోలీసులు ఆ అపార్ట్‌మెంట్‌పై దాడి చేశారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ చట్కా, మట్కా గేమింగ్ నిర్వహిస్తున్న శ్రీకాంత్, హరీష్, సతీష్‌కుమార్, తిరుపతి, వినోద్‌లను అదుపులోనికి తీసుకున్నారు. వారిని ప్రశ్నించగా ఈ గేమ్‌ను నిర్వహిస్తున్నట్టుగా అంగీకరించారు. దాంతో వారి వద్ద ఉన్న త్రీ మాక్ బుక్, ట్యాబ్, రెండు కలర్ ప్రింటర్స్, చట్కా మట్కా బెట్టింగ్ ప్రింటింగ్ పాంప్లెట్స్, 3 బెట్టింగ్ చార్ట్స్, 18 సెల్‌ఫోన్లు, బ్యాంగ్ అకౌంట్ బెట్టింగ్ అమౌంట్ రూ. 2,13,697, నగదు రూ. 1.55 లక్షలను సీజ్ చేశారు.



గాంధీనగర్ కాలనీ రోడ్డులో నిలిచిపోయిన వరదనీటి నాలా పనులు

నాలా నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

పనులు ప్రారంభించారు.. అలా వదిలేశారు..

బన్సీలాల్‌పేట్: బన్సీలాల్‌పేట్ డివిజన్ గాంధీనగర్ కాలనీలో నిర్మిస్తున్న వరదనీటి నాలా పనులు ఒక్కడుగుడు ముందుకు రెండడుగులు వెనక్కు అనే చందంగా సాగుతున్నాయి. పనులు ప్రారంభించి నెలలు గడుస్తున్నా నిర్మాణాలను మాత్రం పూర్తి చేయడం లేదు. దీంతో ఈ రహదారి గుండా రాకపోకలు సాగించే జనం పడుతున్న పాట్లు అవస్థలు అన్నీ ఇన్నీకావు. గాంధీనగర్ కాలనీ రహదారిలో వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గాను రూ. 19.2లక్షల వ్యయంతో వరదనీటి నాలాను నిర్మించాలని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్ణయించారు. ఆ దిశగా పనులు కూడా ప్రారంభించారు. ప్రజాప్రతినిధుల పర్యవేక్షణాలోపం, అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారుతోంది.

గాంధీనగర్‌లో స్థానికుల ఇబ్బందులు

స్థానిక కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల రాజకీయ ఆందోళనలు, ధర్నాలు పోటా పోటీ కార్యక్రమాల కారణంగా ఎట్టకేలకు ఈ వరదనీటి నాలా పనులు ప్రారంభమయ్యాయి. అయితే పనులు వేగవంతంగా చేయించడంలో సదరు పార్టీల నాయకులు విఫలమయ్యారనే విమర్శలు సర్వత్రా విన్పిస్తున్నాయి.

సుమారు 2 నెలలు..

వరదనీటి నాలా పనులు నిలిచిపోయి సుమారు 2 నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. పనుల కోసం నాలా ఇరువైపులా తవ్వకాలు చేపట్టారు. సకాలంలో పూర్తి చేయకపోవడంతో రాకపోకలు సాగించడం కష్టతరంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు, పాదచారులు వాపోతున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు. వరదనీద నీటి నాలా పనుల కారణంగా పక్కనే ఉన్న వ్యాపారస్తుల కార్యకలాపాలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ఈ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో తమ కార్యకలాపాలు ముందుకు సాగుతాయోనని వ్యాపారులు పేర్కొన్నారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

"పనులు త్వరలో ప్రారంభిస్తాం

వరదనీటి నాలా పనులు త్వరలో ప్రారంభిస్తామని డిప్యూటీ ఈఈ ఆంజనేయులు చెప్పారు. కొన్ని సాంకేతిక కారణాలు, ఇతరత్రా సమస్యల కారణంగా నాలా పనులు నిల్చిపోయిన మాట వాస్తవమేనన్నారు. త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారానికి గాను పకడ్బందీగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.

– డిప్యూటీ ఈఈ ఆంజనేయులు

ప్రశాంతంగా 'పది' పరీక్షలు ప్రారంభం



ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పర్యవేక్షిస్తున్న నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

సనత్‌నగర్: పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షా సమయం కాగా గంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పరీక్షా కేంద్రాల అడ్రస్ విషయంలో గందరగోళానికి ఆస్కారం లేకుండా ఒక రోజు ముందుగానే పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి చెక్ చేసుకున్నారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా తనిఖీలు చేసి పరీక్షా కేంద్రంలోకి పంపించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంచారు. అలాగే సమీపంలో ఎలాంటి జిరాక్స్ సెంటర్లు తెరవకుండా చర్యలు తీసుకున్నారు. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధి కిందికి వచ్చే సికింద్రాబాద్ మండలంలో 13, అమీర్‌పేట మండలంలో 10, బాలానగర్ మండలంలో ఒక సెంటర్ మొత్తం 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. వీటి ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ సంక్షేమ హాస్టళ్లకు చెందిన విద్యార్థులు రూ.6,000 మంది వరకు విద్యార్థులు పరీక్షలు రాశారు. ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ముందస్తు కార్యాచరణ రూపొందించి ఆ ప్రకారంగా ట్రాఫిక్ పోలీసులు విధులు నిర్వహించారు. పరీక్షా కేంద్రంలోకి వెళ్లే విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ అంటూ బోర్డును పట్టుకుని ట్రాఫిక్ పోలీసులు వారికి విషెస్ చెప్పారు. నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు పలు పరీక్షా కేంద్రాల వద్దకు చేరుకుని అక్కడ ట్రాఫిక్ పరిస్థితిని పర్యవేక్షించారు.

కబ్జాకు హైడ్రా చెక్

30 ఏళ్ల సమస్యను పరిష్కరించిన అధికారులు



కబ్జాను తొలగించిన హైడ్రా, జీహెచ్ఎంసీ సిబ్బంది

పద్మారావునగర్: సికింద్రాబాద్ శ్రీనివాస్ నగర్ జలమండలి రిజర్వాయర్ సమీపంలోని పద్మారావునగర్ ప్రాంతంలో రోడ్డు కబ్జాను హైడ్రా సిబ్బంది తొలగించారు. సుమారు 30 సంవత్సరాల కొనసాగుతున్న ఈ కబ్జా సమస్యకు ముగింపు పలికారు. ఓ జీహెచ్ఎంసీ విశ్రాంత ఉద్యోగి తనకున్న పలుకుబడితో కబ్జాను కాపాడుకుంటూ వస్తున్నారు. అపార్టుమెంట్ వాసులు జీహెచ్ఎంసీ, రెవెన్యూ ఇతరత్రా విభాగాల అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఏళ్ల తరబడి ఈ వివాదం సాగుతోంది. సమస్య పరిష్కారానికి అపార్టుమెంట్ వాసులు హైడ్రాలో గత సంవత్సరం నవంబర్‌లో ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు రంగ ప్రవేశం చేసి సదరు ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కబ్జా వాస్తవమేనని నిర్ధారించారు. శుక్రవారం హైడ్రా ఇన్‌స్పెక్టర్ ఆదిత్యా, జీహెచ్ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ వి. సమ్మయ్య, టౌన్ ప్లానింగ్ అధికారిణి సుష్మిత తదితరులు సిబ్బందితో కలిసి వచ్చి సదరు కబ్జాను తొలగించారు. ఏళ్ల తరబడి నుంచి కొనసాగుతున్న సమస్యకు పరిష్కారం లభించడంతో స్థానిక అపార్టుమెంట్ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్పీ కాలేజీలో ఉత్సాహంగా 'సమన్వయ'



సమావేశంలో మాట్లాడుతున్న సినీ దర్శకులు శేఖర్ కమ్ముల

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కాలేజీలో శుక్రవారం సమన్వయ-2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. బిజినెస్ మేనేజ్‌మెంట్, వివిధ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ దర్శకులు శేఖర్ కమ్ముల హాజరయ్యారు. కళాశాల చైర్మెన్ పి. హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి రంగారెడ్డి, కోశాధికారి సీజే శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హేమలత, అమరనాథ శర్మ, రాహుల్ యాదవ్, ఎంబీఏ డైరెక్టర్ అనుపమ, హెచ్ఓడీ పల్లవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థులు భవిష్యత్తులో మంచి పారిశ్రామిక వేత్తలుగా రాణించడానికి వీలవుతుందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే తలసాని



బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్.

సనత్‌నగర్: మత సామరస్యానికి ప్రతీకగా రంజాన్ పండుగను జరుపుకుంటారని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బేగంపేటలోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, డీవీ నరేందర్‌రావు, ఆరీఫ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

బౌద్ధనగర్: అభివృద్ధి విషయంలో వెనకడుగు వేయబోమని బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కంది శైలజ శ్రీకాంత్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని నాగయ్య హోటల్ వద్ద నూతనంగా వాటర్ పైప్‌లైన్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ తోనే అభివృద్ధి పనులు సాధ్యమన్నారు. స్థానిక సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటి పరిష్కారానికై నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, జలమండలి ఎఈ ప్రియాంక, పాకసాయి, మల్లేష్, మానస, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను అరెస్టు చేయాలి

లాలాపేట: హస్తినాపురం మహిళా గిరిజన కార్పొరేటర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కోఆర్డీనేటర్ శ్రీరామ్ శివకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..బీఆర్ఎస్ నాయకులు దొరతనాన్ని ప్రదర్శిస్తూ అడగడుగునా దళితులను, గిరిజనులను అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ తక్షణమే సుధీర్‌రెడ్డిని పార్టీ నుంచి తొలగించాలన్నారు.

'విద్యాసంస్థల నిర్మాణానికి సీఎం హామీ'



అర్ధంతరంగా నిలిచిపోయిన విద్యా సంస్థల నిర్మాణం పనులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో నిర్మిస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చినట్టు సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుళ్ల పద్మారావుగౌడ్ ప్రకటించారు. ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయిన విషయాన్ని వినతిపత్రం ద్వారా శుక్రవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రికి వివరించామని పద్మారావుగౌడ్ తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు చిరకాల స్వప్నంగా నిలిచిన జూనియర్, డిగ్రీ కాలేజీల ఏర్పాటును తన ప్రత్యేక విజ్ఞప్తి మేరకు గత ప్రభుత్వం సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే నెలకొల్పినట్లు సీఎంకు వివరించామన్నారు. అప్పట్లో ఉన్నత పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలలకు కొత్త భవనాల నిర్మాణానికి రూ.29.75 కోట్ల నిధులను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసినట్లు పద్మారవుగౌడ్ తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక నిధులను మంజూరు చేయక పోవడంతో ఏడాదికి పైగా పనులు నిలిచిపోయిన విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చామన్నారు.

అసాంఘిక శక్తుల ప్రలోభాలకు గురికావొద్దు

డీసీపీ బాలస్వామి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ బాలస్వామి

లాలాపేట: గత పది రోజుల నుంచి ఉస్మానియా యూనివర్సిటీలో కొనసాగుతున్న విద్యార్థి సంఘాల నిరసన, బంద్, ఆందోళన కార్యక్రమాలపై ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి స్పందించారు. శుక్రవారం ఓయూలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఓయూ రిజిస్ట్రార్ జారీ చేసిన సర్క్యులర్‌పై విద్యార్థి సంఘాలు చేపట్టిన ఆందోళన, నిరసన కార్యక్రమాల నేపథ్యంలో పోలీసుశాఖ చాకచక్యంగా వ్యవహరించి శాంతి భద్రతలను పరిరక్షించామన్నారు. ప్రస్తుతం క్యాంపస్‌లో ప్రశాంతమైన వాతావరణం నెలకొందన్నారు. ఇంటలిజెన్స్ సమాచారం ప్రకారం కొన్ని అసాంఘిక శక్తులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓయూలో చేరి క్యాంపస్ విద్యా వాతావరణాన్ని కలుషితం చేసే అవకాశం ఉందన్నారు. విద్యార్థులకు ఏవిధమైన సమస్యలున్నా సంబంధిత అధికారులకు వినతి పత్రాల ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. అసాంఘిక శక్తుల ఆకర్షణకుగురూ యూనివర్సిటీ వాతావరణాన్ని పాడు చేయాలని చూస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏసీపీ జగన్, ఇన్స్‌పెక్టర్ రాజేందర్ తదితరులున్నారు.

మహిళా సాధికారత సాధించినప్పుడే దేశాభివృద్ధి



ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమానికి హాజరైన మహిళలతో కోట నీలిమ

సనత్‌నగర్: మహిళా సాధికారత సాధించినప్పుడే దేశాభివృద్ధి జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ అన్నారు. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లో నిర్వహించిన ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు తమ హక్కులను సాధించుకునేందుకు కలసికట్టుగా పోరాడాలన్నారు. రాజకీయాల్లో మహిళా భాగస్వామ్యం పెంచేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తోందన్నారు. సమావేశంలో ఇందు శ్రీరంగం, విజయలక్ష్మీ, రమణిరెడ్డి, అంజలియాదవ్, రమాదేవి పాల్గొన్నారు.

హక్కులతోపాటు బాధ్యతలు గుర్తించండి



గాంధీ సూపరింటెండెంట్ రాజకుమారిని సన్మానిస్తున్న టీఎన్‌జీఓ ఫోరం ప్రతినిధులు

గాంధీఆస్పత్రి: హక్కులతోపాటు బాధ్యతలను గుర్తించి, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎస్ రాజకుమారి ఉద్బోధించారు. టీఎన్‌జీఓ మెడికల్ అండ్ హెల్త్ సెంట్రల్ ఫోరమ్ ఆధ్వర్యంలో గాంధీఆస్పత్రి ప్రాంగణంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జరిగే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు. టీఎన్‌జీఓ కేలండర్, డైరీలను ఆవిష్కరించారు. సూపరింటెండెంట్ రాజకుమారిని సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ మెడికల్ అండ్ హెల్త్ సెంట్రల్ ఫోరమ్ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, గాంధీ అసిస్టెంట్ డైరక్టర్ ఫ్లోరెన్స్‌మెర్లిన్ పాల్గొన్నారు.

పురుగుల అన్నం పెడుతున్నారంటూ విద్యార్థుల ధర్నా

రహమత్‌నగర్: తమకు పురుగుల అన్నం పెడుతున్నారంటూ హాస్టల్ విద్యార్థులు రోడ్కెక్కారు. తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆందోళనలో పాల్గొన్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం అయింది. వివరాలివీ... రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్ హిల్స్‌లోని ఎస్టీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు తమకు పెడుతున్న అన్నంలో పురుగులు వస్తున్నాయని, ఇటీవల ఇద్దరూ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారంటూ శుక్రవారం సాయంత్రం రహదారిపై ఆందోళన నిర్వహించారు. దీంతో హైటెక్ సిటీ, బోరబండ, ఎమ్మెల్యే కాలనీ, కార్మిక నగర్ వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. బోరబండ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళన చేస్తున్న విద్యార్థులను సముదాయించి విరమింపజేశారు.

సందడి చేసిన చిన్నారులు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో హిందూ కిడ్స్ స్నాతకోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు స్నాతకోత్సవ డ్రెస్సులో సందడి చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలతో చూపరులను ఆకట్టుకున్నారు. డ్యాన్సలతో మురిపించారు. ఈ సందర్భంగా యూకేజీ, ఒకటో తరగతికి చెందిన 240 మంది విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేశారు. స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రతినిధులు కంజర్ల చంద్రకళాయాదవ్, హెచ్ఎస్ త్రిపాఠి, ప్రిన్సిపాల్ రాధిక హాజరయ్యారు.



సింపోజియం..ఉత్సాహం..

ఓయూలో ప్రారంభమైన నేషనల్ టెక్నికల్ సింపోజియాలు



విద్యుత్ తయారీ పద్ధతులను పరిశీలిస్తున్న వరుణ్‌రెడ్డి



విద్యార్థులు తయారు చేసిన శాటిలైట్ వెహికల్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీలో నేషనల్ టెక్నికల్ సింపోజియాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాశాలలోని సివిల్, మెకానికల్, ఎలెక్ట్రికల్, ఎలెక్ట్రానిక్స్, కంప్యూటర్ సైన్స్, బయోమెడికల్, మైనింగ్ ఇంజినీరింగ్ విభాగాలలో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలతో ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. వీసీ ప్రొ.కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.నరేష్ రెడ్డి, ప్రిన్సిపల్ ప్రొ.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపల్ ప్రొ.మంగు ఆయా కార్యక్రమాలలో అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.

- ఆకృతి-2025 పేరుతో ఎలెక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాక్ చిప్ టెక్నాలజీ ఎండీ, సీఈవో ముఖ్యఅతిథిగా హాజరుకాగా హెడ్ ప్రొ.రామకృష్ణ, స్టూడెంట్స్ కన్వీనర్లు రాహుల్ కార్తీకేయ పాల్గొన్నారు.
- టెక్నోనెన్స్-2025 పేరుతో ఎలెక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీజీఎస్‌పీడీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వరుణ్‌రెడ్డి,గౌరవ అతిథిగా ఈఈఈ పూర్వవిద్యార్థి గోపాల్ టీకే కృష్ణ, హెడ్ ప్రొ.విద్యాసాగర్, కోఆర్డినేటర్లు డా.శిరీష, డా.సుశీల, స్టూడెంట్స్ కోర్డినేటర్ జశ్వంత్, దక్షిణ్యా తదితరులు పాల్గొన్నారు.
- మెడిటెక్-2025 పేరుతో బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఇంజినీరింగ్ ఫ్యాకల్టీ డీన్, సీనియర్ ప్రొ.కృష్ణయ్య, న్యూరోసర్జన్ డా.రమేష్, ప్రత్యేక ఆహ్వానితులు రాజేంద్ర ప్రకాష్, హెడ్ ప్రొ.మాళిని, కోఆర్డినేటర్ డా.మేడి శ్రీనివాస్, స్టూండెంట్స్ కోర్డినేటర్స్ ఎస్‌పీ శ్రీక్రాంత్, అధ్యాపకులు డా.సుమన్, డా.విద్యాసాగర్, డా.శ్రవణ్య, డా.హరీష్, కిరణ్, గాయత్రి పాల్గొన్నారు.
- మెకానికల్ ఇంజినీరింగ్‌లో మెఖరీణ-2025 పేరుతో జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొ.కుమార్, డా.నాయిని కిశోర్‌నాథ్, హెడ్ ప్రొ.హద్యా, ఫ్యాకల్టీ అడ్వైజర్ ప్రొ. శివ రామకృష్ణ, డా.వెంకటేశ్వర్లు, డా.ఉదయ్ కిరణ్, డా.బుచ్చయ్య, డా.నాగవేణి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.
- కంప్యూటర్ సైన్స్‌లో ఇన్ఫినిటీ-2025 పేరుతో, సివిల్ ఇంజినీరింగ్‌లో నిర్మాణ్-2025 పేరుతో, మూనింగ్ ఇంజినీరింగ్‌లో ఇన్‌సైట్-2025 పేరుతో రెండు రోజుల సింపోజియాలను ప్రారంభించారు. సదస్సుల్లో లైవ్ ఎగ్జిబిషన్స్, పేపర్, పోస్టర్ ప్రజెంటేషన్స్, వివిధ అంశాల పై చర్చ, డాన్సులు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు.

'విలువలతో కూడిన విద్యను అందిస్తాం'

బంజారాహిల్స్: విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా సంకల్ చంద్ పటేల్ యూనివర్సిటీ పనిచేస్తుందని ఆ వర్సిటీ అధ్యక్షుడు ప్రకాష్‌భాయ్ పటేల్ అన్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-36లో యూనివర్సిటీ దక్షిణ భారతీయ ప్రాంతీయ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రకాష్‌భాయ్ పటేల్ మాట్లాడుతూ..సమాజహితం కోసం పనిచేసే ముఖ్యమైన వనరుగా యూనివర్సిటీ నిలుస్తుందన్నారు. గుజరాత్‌లో విద్య, ఆరోగ్య సంరక్షణ కేంద్రాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. తమ యూనివర్సిటీ విద్యార్థులకు స్కూల్ స్థాయి నుంచి పీహెచ్‌డీ వరకు ఫిలింత్రోఫిక్, విలువ ఆధారిత సమగ్ర విద్యను అందిస్తోందన్నారు. రిజిస్ట్రార్ పరిమిల్ త్రివేదీ, ఎస్‌పీసీఈ ప్రిన్సిపాల్ డా. పీజే పటేల్ పాల్గొన్నారు.